క్లుప్తంగా

చలో విజయవాడ విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీసీపీఎస్ఈఏ నాయకులు

జలుమూరు: ప్రస్తుతం ఉన్న సీపీఎస్, జీపీఎస్ విధానాలను రద్దు చేయాలని కోరుతూ డిసెంబర్ 10న విజయవాడలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు మెండ రామారావు ప్రభుత్వ ఉద్యోగులను కోరారు. ఈ మేరకు మంగళవారం కరవంజ మోడల్ స్కూల్‌లో చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉద్యోగులపై పెట్టిన కేసులు రద్దు చేయాలని, పాత పింఛన్ విధానం కొనసాగించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేశవరావు, జనార్దన, శిరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం ఎంఈఓగా గోవిందరావు



పాతపట్నం: స్థానిక ఎంఈఓ–1గా ఎ.గోవిందరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తూ, పూర్తి బాధ్యతలు(ఎఫ్ఏసీ) చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎంఈఓ–1 బి.శ్రీధర్ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఎంఈఓను హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

చేప పిల్లల పంపిణీ



పెద్దసున్నాపురం చెరువులోకి చేపపిల్లలను విడిచిపెడుతున్న ఎఫ్‌డీఓలు

పాతపట్నం: గిరిజనులకు 100 శాతం రాయితీతో చేపపిల్లలను అందజేస్తున్నామని మత్స్యశాఖ ఎఫ్‌డీఓలు ముసలినాయుడు, సుదర్శన్ తెలిపారు. మండలంలోని గిరిజన గ్రామల్లో మత్స్యకారులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో మంగళవారం చేపపిల్లలను పంపిణీ చేశారు. ఎఫ్‌డీఓలు మాట్లాడుతూ సోద, రేణుగూడ, పుతికగూడ, పెద్దసున్నాపురం, బైదలాపురం, ఎస్.ఎస్.మనుగు, బురికిపేట, రంకిణి, లాబర గిరిజన గ్రామాల్లో ఉన్న 26 చెరువుల్లో 1,13,400 చేప పిల్లలు విడిచిపెట్టడం జరిగిందన్నారు. గిరిజనులు, ఫిషరిష్ అసిస్టెంట్లు, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం విక్రయంపై అవగాహన



కంబకాయలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సునీత


నరసన్నపేట: ధాన్యం కొనుగోలు ప్రారంభమయ్యాయని, రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లుకు ధాన్యం తీసుకువెళ్లవచ్చని ఏఓ కె.సునీత తెలిపారు. మండలంలోని కంబకాయలో రైతులకు ధాన్యం కొనుగోలుపై మంగళవారం అవగాహన కలిగించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. క్వింటా ధాన్యం గ్రేడ్–ఏ అయితే రూ.2,320, కామన్ వెరైటీ రూ.2,300 అని తెలిపారు. తేమ శాతం 17 ఉండాలని, అప్పుడే ఈ ధర లభిస్తుందన్నారు. తేమ శాతం పెరుగుతున్న కొద్దీ ఒక్కో శాతానికి ఒక్కో కేజీ రైతులు ఇచ్చేందుకు సిద్ధమైతే ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించవచ్చన్నారు. జీపీఎస్ ఉన్న వాహనాల ద్వారా మాత్రమే ధాన్యం తరలించడం జరుగుతుందన్నారు. రైతు రైస్ మిల్లును ఎంచుకొనే అవకాశం నిబంధనల్లో ఉందన్నారు.

ఎకరాకు 29 బస్తాల దిగుబడి

నరసన్నపేట: మండలంలోని నడగాం రైతు సేవా కేంద్రం పరిధి దాసరివానిపేటలోని సనపల చిన్నబాబు పొలంలో మంగళవారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. రైతు స్వర్ణ రకాన్ని పండించారు. ఈ పొలం పంటకోత ప్రయోగానికి ఎంపికైంది. ఎకరాకు 29 బస్తాలు ధాన్యం దిగుబడి నమోదైందని నడగాం రైతు సేవా కేంద్రం వీఏఏ శ్రవంతి తెలిపారు. నడగాం ప్రాంతంలో మంచి దిగుబడి నమోదు అవుతుందన్నారు.

చెరకు టన్ను రూ.3,151

- మద్దతుధర ప్రకటించిన సంకిలి ఈఐడీ చక్కెర కర్మాగారం
- ఈనెల 20 నుంచి క్రషింగ్ ప్రారంభం



వి.పట్టాభిరామిరెడ్డి

రేగిడి: మండలంలోని సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం యాజమాన్యం చెరకు రైతులకు తీపికబురు చెప్పింది. ఈ నెల 20 నుంచి చెరకు క్రషింగ్ ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. కర్మాగారం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ వి.పట్టాభిరామిరెడ్డి మాట్లాడారు. ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం 2024–25 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి టన్ను చెరకకు రూ.3,151లు మద్దతు ధర చెల్లిస్తామని వెల్లడించారు. గత ఏడాది కంటే టన్నుకు రూ.71లు పెంచినట్టు పేర్కొన్నారు. క్రషింగ్ సీజన్ అనంతరం రైతులకు ప్రోత్సహకాలు అందజేస్తామని చెప్పారు. సమావేశంలో కేన్ డీజీఎం ఆర్.రమేష్ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యం!



నివగాం ఇసుక ర్యాంప్ సమీపంలోని మాతల–నివగాం వంతెన

- పగలు ఇసుక డంపింగ్.. రాత్రి లోడింగ్
- మాతల – నివగాం వంతెనకు ప్రమాదం
- చోద్యం చూస్తున్న అధికారులు



ఆకులతంసర వద్ద లారీకి ఇసుక లోడ్ చేస్తున్న ప్రొక్లెయిన్

సాక్షి టాస్క్‌ఫోర్స్: పేరుకే అధికారిక ఇసుక ర్యాంపులు.. చేస్తున్నదంతా ఇష్టారాజ్యమనే ఆరోపణలున్నాయి. నిబంధనలను పాటించకుండా ఇష్టం వచ్చినట్లు ఇసుక ర్యాంప్‌లను నిర్వహిస్తున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కొత్తూరు మండలంలో నివగాం, ఆకులతంపర వద్ద ప్రభుత్వ ఇసుక ర్యాంపులను మంజూరయ్యాయి. వంశధార నదిపై నిర్మించిన మాతల–నివగాం వంతెనకు అర కిలో మీటర్ దూరంలో నదిలో ఇసుక తవ్వకాలను మనుషులతో చేయించాలి. ర్యాంప్ నిర్వాహకులు మాత్రం నదికి అర కిలో మీటరు కంటే తక్కువ



నివగాం వద్ద ప్రొక్లెయిన్‌తో ఇసుక తవ్వకం

దూరంలో ఇసుక తవ్వకాలను ఇష్టానుసారంగా చేస్తున్నారు. నివగాం ర్యాంపుతోపాటు అంగూరు ర్యాంప్ (ఆకులతంపర) వద్ద కూడా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపణలున్నాయి. నిబంధనల ప్రకారం సుమారు 3 అడుగుల లోతులో మనుషులతో ఇసుక తవ్వకం చేయాలి. అలా కాకుండా ప్రొక్లెయిన్లతో మూడు అడుగులు కంటే ఎక్కువ లోతులో ర్యాంప్ నిర్వాహకులు తవ్వకాలను చేయిస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాల వలన నదిలో పలుచోట్ల చెరువులను తలపించేలా గోతులు కనిపిస్తున్నాయి. ఇసుకను నది సమీపంలో నిల్వచేసి లారీలకు మనుషులతో లోడ్ చేయాలి. దీనికి విరుద్ధంగా నదిలోకి లారీలు తీసుకువెళ్లి ప్రొక్లెయిన్‌తో లోడ్ చేయిస్తున్నారు.

ఒడిశా బిల్లులతో ఇసుక అక్రమ తరలింపు..

ర్యాంప్ సమీపంలోనే ఇసుకను స్టాక్ చేయాలి. గ్రామ సచివాలయం, మీ–సేవ కేంద్రంలో నగదు చెల్లించిన తరువాత లారీలకు కూలీలతో లోడ్ చేయించాలి. పగలు మాత్రమే లారీలతో ఇసుక తరలించాలి. పగలంతా నదిలో నుంచి ట్రాక్టర్ ద్వారా ఇసుకను డప్పింగ్ చేస్తున్నారు. రాత్రి సమయాల్లో ఒడిశా బిల్లులతో ఇసుకను అక్రమంగా లారీలతో తరలిస్తున్నారు. ఒడిశాతోపాటు పలాస, విశాఖపట్నం, విజయనగరం వంటి పట్టణాలకు తరలిస్తున్నట్లు సమాచారం. రెండు ర్యాంపుల్లోనూ ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వంతెనకు ప్రమాదమే..

వంతెన కింద భాగాన అర కిలో మీటరు కంటే తక్కువ దూరంలో ఇసుక లోతుగా తవ్వితే.. వంతెనకు ప్రమాదం ఉంటుంది. వంతెనకు కింద భాగాన ఇసుక తొలగించడం వలన కోతకు గురి అవుతుంది. నిబంధనలను ఉల్లంఘిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– గోపాలరావు, జేఈఈ ఆర్అండ్‌బీ, కొత్తూరు



ప్రొక్లెన్‌తో ఇసుక తవ్వడంతో ఏర్పడిన గొయ్యి

పొంచి ఉన్న ప్రమాదం..



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి సమీపంలోని అవధానుల చెరువు వద్ద ఉన్న వంతెన. ఆర్ అండ్‌బీ రహదాలో ఉన్న వంతెనకు ఇరువైలా రక్షణ గోడులు శిథిలావస్థకు చేరుకున్నాయి. బ్రిడ్జీ వద్ద వాహనాలు ఓవర్‌టేక్ చేసే సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం సాగిస్తున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

అల్లుకున్న తామర



సారవకోట మండల కేంద్రంలోని శివరామపాత్రుని కోనేరులో తామర అల్లుకుంది. స్థానికులు ఈ నీటిని వినియోగించేందుకు ఉపయోగపడటం లేదు. గతేడాది ఈ చెరువులో నీటిని విడిచిపెట్టి ఉపాధి హామీ పథకం ద్వారా లోతుచేసి దీంట్లో ఉన్న తామర దుంపలను సైతం తొలగించారు. అయినప్పటికీ ప్రస్తుతం చెరువు నిండా దట్టంగా తామర అల్లుకుంది. ఈ చెరువు గట్టుపై మూడు ఆలయాలు ఉండటంతో కార్తీక మాసంలో స్థానికులు వినియోగించేందుకు అవకాశం లేకుండా పోతుంది.

– సారవకోట

ప్రమాదకర మలుపు



కొత్తూరు మండలం మాకవరం గ్రామ చెరువు వద్ద మాతల–రుగడ రోడ్డులోని మలుపు ప్రమాదకరంగా ఉంది. పిచ్చిమొక్కలతోపాటు చెరకు పంట ఉన్నందున ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడంలేదు. ఈ మలుపు వద్ద పలుసార్లు ప్రమాదాలు జరిగాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

– కొత్తూరు

రోడ్డుపైనే పశువులు..



ఎల్.ఎన్.పేట మండలంలోని సరడాం గ్రామంలోని రోడ్లు పశువులకు నిలయంగా మారిపోయాయి. వీధుల్లో నడిచి వెళ్లాలన్నా, ద్విచక్ర వాహనం, ఆటోల్లో వెళ్లాలన్నా ఇబ్బంది పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, మహిళలు వీధుల్లోకి రావాలంటే భయపడుతున్నారు. పశువులను వీధుల్లో కట్టకుండా చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు



మాట్లాడుతున్న జడ్జి సన్యాసినాయుడు

నరసన్నపేట: రిమాండ్ ఖైదీలకు న్యాయ సేవా కేంద్రం అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నరసన్నపేట సబ్‌జైల్‌ను మంగళవారం తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఉచిత న్యాయ సేవలు కావాల్సినవారు స్థానిక జడ్జి ద్వారా రిక్వెస్ట్ పెట్టుకొంటే దానిని పరిశీలించి న్యాయవాదిని కల్పిస్తామన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వచ్చే నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్టు, సబ్‌జైల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్య విధానంపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్లు విలియమ్స్, నీతూ, తదితరులు

ఎల్.ఎన్.పేట: ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీకాకుళం ఆయుష్ విభాగం సీనియర్ డాక్టర్ పి.విలియమ్స్, తురకపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు నీతూ, లక్ష్మీదీప్ అన్నారు. మండలంలోని తురకపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో మంగళవారం జరిగిన సమావేశంలో వీరు మాట్లాడారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఆహారపు అలవాట్లు అనేక రోగాలను తెచ్చి పెడుతున్నాయన్నారు. ప్రకృతి మనకు ఇచ్చిన అనేక అలవాట్లును మరిచిపోతున్నామని, ఆయుష్ వైద్య విధానం ఎంతో ఉత్తమమని వివరించారు. గ్రామాల్లో ఆయుష్ వైద్య పద్ధతులను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈశ్వరమ్మ, కిరణ్ కుమార్, ఆరుద్ర తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి రాణి

కొత్తూరు: రాజీకి లోబడి ఉన్న కేసులను రాజీ చేసేందుకు ప్రయత్నించాలని పోలీస్ అధికారులకు స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కె.రాణి సూచించారు. స్థానిక కోర్టులో మంగళవారం కొత్తూరు, పాలకొండ సీఐలు, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 14 తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకునేలా పోలీసులు కృషి చేయాలన్నారు. కేసుల రాజీ కావడం వలన కలిగే ప్రయోజనాలు వివరించాలన్నారు. ఏజీపీ రఘునాథరావు, కొత్తూరు, పాలకొండ సీఐలు చింతాడ ప్రసాదరావు, చంద్రమౌళి, కొత్తూరు, దొనుబాయి, సీతంపేట, బత్తిలి, హిరమండలం ఎస్ఐలు పాల్గొన్నారు.

సందడిగా వన భోజనం



భోజనాలు వడ్డిస్తున్న ఏఎఫ్‌కేకే సంఘం ప్రతినిధులు

పొందూరు: స్థానిక ఏఎఫ్‌కేకే సంఘం ఆధ్వర్యంలో వనభోజనం కార్యక్రమాన్ని మంగళవారం సందడిగా నిర్వహించారు. ప్రతిఏటా కార్తీక మాసంలో ఈ సంస్థ ఆధ్వర్యంలో వనభోజనాలు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్యక్రమంలో ఏఎఫ్‌కేకే సంఘం కార్యదర్శి దండా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం



సీమంతం నిర్వహిస్తున్న సత్యసాయి భక్తులు

బూర్జ: మండలంలోని లక్కుపురం గ్రామం సత్య సాయి భజన మందిరంలో సామూహిక సీమంతాన్ని ఎంపీపీ కర్నేన దీప ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సత్యసాయి జన్మదిన వేడుకల సందర్భంగా 25 మందికి సీమంతం నిర్వహించారు. జిల్లా జాయింట్ యూత్ కో ఆర్డినేటర్ ఎస్.జ్యోతి, ఉష, రాజేశ్వరి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

హెల్మెట్ ధారణ తప్పనిసరి




వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ రమేష్ బాబు

మెళియాపుట్టి: ద్విచక్ర వాహదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మెళియాపుట్టి ఎస్ఐ రమేష్ బాబు అన్నారు. మంగళవారం పట్టుపురం మూడు రోడ్ల కూడలిలో వాహన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న పలువురికి అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు.

అందుబాటులో ఎరువులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని ఏఓ పైడి లతశ్రీ తెలిపారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో మొక్కజొన్న, వరి తదితర పంటలను పండిస్తున్నారన్నారు. మండలంలోని తురకపేట, మిరియాపల్లి, పెద్దకోట తదితర రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళి



ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి

ఆమదాలవలస: మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పేదల ఆశాజ్యోతి అని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆమె విగ్రహానికి మంగళవారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అపార్ పూర్తిచేయాలి

నరసన్నపేట: విద్యార్థులకు ఎంతగానో ఉపకరించే అపార్ ప్రక్రియ తొందరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ బి.మధుసూదనరావు అన్నారు. మంగళవారం ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల ప్రతినిధులు, ప్రభుత్వ స్కూల్ హెచ్ఎంలతో ఎంఈఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు వివరాల అప్‌లోడ్ 90 శాతం అయిందని, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల్లో పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. ఈ వారంలో శతశాతం అపార్ పక్రియ పూర్తిచేయాలన్నారు. ఎంఈఓలు దాలినాయుడు, శాంతారావు ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

పాతపట్నం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పాతపట్నం సీఐ వి.రామారావు అన్నారు. స్థానిక ఆల్ ఆంధ్రారోడ్డు సమీపంలోని మహేంద్ర డిగ్రీ కళాశాల, అమరజ్యోతి పాఠశాలలో సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాళ్లు ఎం.సోమేశ్వరరావు, శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

కొత్తూరు: సైబర్ మోసాలపై బ్యాంకు ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ చింతాడ ప్రసాదరావు అన్నారు. మండలంలోని బమ్మిడి గ్రామంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. యువత బెట్టింగ్‌లకు పాల్పడి లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటున్నారన్నారు. దీంతో ఆయా కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. ఎస్ఐ ఎం.ఎ.అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఆమదాలవలస: స్వయం సంఘాల మహిళా పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకోవాలని డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ డి.సంధ్యారాణి అన్నారు. మంగళవారం పురపాలక సంఘం పరిధిలోని 23వ వార్డు లక్ష్ముడుపేటలో యూనియన్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఎవరైనా ఏటీఎం పిన్, బ్యాంక్ అకౌంట్ తదితర వివరాలను అడిగితే చెప్పవద్దన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన పథకాన్ని 18 నుంచి 50 సంవత్సరాల లోపు వారికి వర్తిస్తుందని, సంవత్సరానికి రూ.436 ప్రీమియం చెల్లించాలన్నారు. సహజ మరణం పొందితే రూ.2 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం 18 నుంచి 70 ఏళ్ల లోపు వయసు వారికి వర్తిస్తుందని, సంవత్సరానికి రూ.20 ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. బ్యాంక్ అధికారి సువ్వారి రవిబాబు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, హెల్త్ సెక్రటరీ తులసీబాయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల తరలింపుపై కోర్టును ఆశ్రయిస్తాం



మాట్లాడుతున్న సువ్వారి గాంధీ

ఆమదాలవలస: మండలంలోని చింతలపేట పంచాయతీ పరిధిలోని దండేవలసలో గల ప్రభుత్వ కార్యాలయాల తరలింపుపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. మంగళవారం పట్టణంలోని బొడ్డేపల్లిపేటలోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుపరిపాలన అందించాలన్న ఉద్దేశంతో చింతలపేట, బొబ్బిలిపేట పంచాయతీలకు మధ్యలో ఉన్న దండేవలసలో సచివాలయాన్ని, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నిర్మించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దండేవలసలో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలను మూసివేసి చింతలపేటకు తరలించుకుపోవడం సహేతుకం కాదన్నారు. దీనిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సువ్వారి అనిల్ కుమార్, పేడాడ వైకుంఠరావు, అన్నెపు సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో సంపద సృష్టిద్దాం



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసన్

నరసన్నపేట: చెత్తనుంచి సంపద సృష్టించే అవకాశాలు ఉన్నాయని సాలిడ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రతినిధి (తమిళనాడు) సి.శ్రీనివాసన్ అన్నారు. చెత్తనుంచి సంపద తీసుకురావడానికి రాష్ట్రంలో నరసన్నపేటను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నరసన్నపేటలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. పట్టణ ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పలు సేవా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పంచాయతీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. చెత్త నుంచి సంపద ఎలా సృష్టించవచ్చో పవర్ పాయింటు ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. స్థానిక స్వచ్ఛంద సంస్థ ఎస్‌వీసీటీ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. జిల్లా కలెక్టర్‌తో కూడా దీనిపై చర్చిస్తామన్నారు. పంచాయతీ పెద్దలు చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, వైశ్వరాజు కేశవరాజు, ఊణ్ణ రంగనాథ్, జామి వెంకటరావు, గొద్దు చిట్టిబాబు, ఊణ్ణ శ్రీధర్, ఊణ్ణ సోమేశ్వరరావు, ధర్మాన జగన్, పంచాయతీ ఈఓ ద్రాక్షాయిని పాల్గొన్నారు.

న్యాయం చేయాలి



మాట్లాడుతున్న గిరిజనులు

హిరమండలం: ఎంతో కాలంగా సాగుచేస్తున్న భూములు తమకే చెందాలని మర్రిగూడ, దాసుమానుగూడకు చెందిన పలువురు గిరిజనులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సవర తిరుపతిరావు, సవర కొవ్వారి, సుంబూరు, రమేష్, శ్రీను, సురేష్ విలేకర్లతో మాట్లాడారు. మర్రిగూడ, దాసుమానుగూడ గ్రామాల్లో 30 ఆదివాసీ పీవీటీజీ తెగకు చెందిన కుటుంబాలు ఉన్నాయన్నారు. ముత్తాతల కాలం నుంచి సుమారు 25 ఎకరాలు సాగులో చేస్తున్నామన్నారు. కొంతమంది గిరిజనేతరులు తమ భూములను వారి పేరు మీద అక్రమంగా పట్టాలు చేయించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు విన్నవించామన్నారు. రెవెన్యూ అధికారులు రీ సర్వే చేసి పట్టాలు ఇస్తామని చెప్పారన్నారు. రీ సర్వే సమయంలో తమకు పట్టాలు ఇవ్వకుండా గిరిజనేతరులకే పట్టాలు మంజూరు చేశారన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని గిరిజనులు కోరారు.

భవిత కేంద్రం సందర్శన

పొందూరు: స్థానిక భవిత కేంద్రాన్ని శ్రీకాకుళం సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా సహిత విద్య అసిస్టెంట్ కో ఆర్డినేటర్ ఉమ, ఎంఐఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్ శోభా మంగళవారం సందర్శించారు. దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటించారు. భవిత కేంద్రంలో అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు గీచిన చిత్రాలను చూసి అభినందించారు. సహిత విద్య ఉపాధ్యాయులు దినేష్, రాధారాణి పాల్గొన్నారు.

67,800 చేప పిల్లల విడుదల

సారవకోట: ఐటీడీఏ ద్వారా అందిస్తున్న చేప పిల్లలను గిరిజన మత్స్యకారులు వినియోగించుకోవాలని తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని బుడితి, దాసుపురం, మాళువ, సవరమాళువ గిరిజన గ్రామాల్లో ఉన్న 11 చెరువుల్లో 67,800 చేప పిల్లలను మంగళవారం విడుదల చేశారు. ఐటీడీఏ ద్వారా గిరిజన మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు చెరువులలో చేప పిల్లల్ని విడిచి పెడుతున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ కృష్ణమోహన్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సురేష్‌కుమార్, ఫిషరీష్ అసిస్టెంట్ వెంకటేష్, మాజీ సర్పంచ్ రామారావు ఉన్నారు.